క్లుప్తంగా

నేడు పింఛన్‌దారులకు ఆరోగ్య పరీక్షలు

కలసపాడు : మండలంలోని 22 మంది పింఛన్ దారులకు శుక్రవారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మహబూబ్‌బీ తెలిపారు. మండలంలోని పక్షవాతం, నడవలేని, మంచానికి పరిమితమైన 18 మంది, కండరాల క్షీణత, ప్రమాదానికి గురైన నలుగురికి మొత్తం 22 మందికి వైద్య పరీక్షల నిమిత్తం ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి వైద్యపరీక్షలు అందిస్తారని, పింఛన్‌దారులు అందుబాటులో ఉండి వైద్యపరీక్షలు చేయించుకోవాలని ఆమె కోరారు.

విత్తన శుద్ధితో అధిక దిగుబడులు



విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

చాపాడు : రబీలో ఆరుతడి పంటలు సాగు చేసుకునే రైతులు విత్తనశుద్ధి చేస్తే అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయాధికారి మ్యాగీ అన్నారు. మండలంలోని బద్రిపల్లె, నెర్రవాడ గ్రామాలలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. రైతులు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం క్రింద రబీ పంటలకు బీమా ప్రీమియం కట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ ఆర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పుట్టిన రోజు వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ అభిమానులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీరాములపేటలోని ఎమ్మెల్సీ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ పుట్టిన రోజు వేడుకలను వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంచారు. ఈ కార్యక్రమంలో నీలపాల రాముడు, సాధు ప్రసాద్, శ్రీధర్, సురేంద్ర, డీసీ వంశీ, బ్రహ్మయ్య, సుధాకర్, ముని, వంశీ, షేక్ హాజీ, గోకుల్, వెంకి సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ చైర్మన్ చల్లా రాజగోపాల్ యాదవ్

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీకృష్ణాలయంలో గురువారం ఆలయం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆలయ చైర్మన్ చల్లా రాజగోపాల్ యాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిటీ సభ్యులు, శ్రీకృష్ణ భక్తుల సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఆలయం ఆధ్వర్యంలో తొలిసారి నూతన సంవత్సర క్యాలెండర్‌ను రూపొందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి పొడావుల గండి ఆంజనేయులు యాదవ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామోత్సవం



దేవగుడిలో సీతా రాముల ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

జమ్మలమడుగు రూరల్ : మండల పరిధిలోని దేవగుడి గ్రామంలో కనుల పండువగా శ్రీ సీతా రాముల గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం సంక్రాంతి ఉత్సవాల భాగంగా శ్రీ సీతా రాముల ఉత్సవ విగ్రహాలను ట్రాక్టర్‌లో పెట్టుకుని పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కోడి పందెంరాయుళ్ల అరెస్టు

లింగాల : మండలంలోని అంబకపల్లె ఘాట్ దగ్గర గురువారం ఉదయం కోడి పందేల స్థావరాలపై దాడిచేసి 8 మంది కోడి పందెంరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ మధుసూదనరావు తెలిపారు. తమకు సమాచారం రావడంతో పోలీసు సిబ్బందితో దాడి చేసి 9 కోళ్లతోపాటు రూ.8730 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

అల్లాడుపల్లెలో వీరభద్రస్వామి గ్రామోత్సవం



అల్లాడుపల్లెలో శ్రీవీరభద్రస్వామి గ్రామోత్సవంలో భక్తులు



సిద్దారెడ్డిపల్లెలో లక్ష్మీచెన్నకేశవ స్వామి ఊరేగింపు

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లెలో వీరభద్రస్వామి, భద్రకాళి గ్రామోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. కనుమ సందర్భంగా అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థానం నుంచి మొదలైన గ్రామోత్సవం గురువారం ఉదయం అల్లాడుపల్లెకు చేరింది. భక్తులు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కిషోర్‌కుమార్‌రెడ్డి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

లక్ష్మీచెన్నకేశవస్వామి గ్రామోత్సవం

మండలంలోని సిద్దారెడ్డిపల్లెలో గురువారం తెల్లవారు జామున మూడు గంటల నుంచి లక్ష్మీచెన్నకేశవస్వామి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. చియ్యపాడులోని ఆలయం నుంచి ఊరేగింపుగా గ్రామోత్సవం సిద్దారెడ్డిపల్లెకు చేరుకుంది. ప్రతి ఇంటి వద్ద స్వామికి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

23న తలనీలాల సేకరణకు వేలం

గోపవరం : మండలంలోని మల్లెంకొండేశ్వరస్వామి ఆలయం, బద్వేలు మండలంలోని లంకమల రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో తలనీలాల సేకరణ కోసం ఈనెల 23వ తేదీన వేలంపాట నిర్వహించనున్నట్లు దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి ఎస్.రామలింగారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఫిబ్రవరి 26వ తేదీ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా తలనీలాల సేకరణకు ఈ వేలంపాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 23వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు మల్లెంకొండేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి, సాయంత్రం 3 గంటలకు లంకమల రామలింగేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానంలోని బద్వేలు దేవదాయశాఖ కార్యాలయంలో అధికారుల సమక్షంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. మల్లెంకొండేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి ఫిబ్రవరి 26, 27వ తేదీల్లో రెండు రోజుల పాటు తలనీలాలు సేకరించుకునేందుకు వేలంపాటలో పాల్గొనే వారు రూ.50 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉందన్నారు. అలాగే లంకమల రామలింగేశ్వర స్వామి ఆలయానికి సంబంధించి ఫిబ్రవరి 26, 27వ తేదీల్లో రెండు రోజుల పాటు తలనీలాలు సేకరించేందుకు రూ.25 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉందన్నారు. అలాగే టెంకాయలు విక్రయించుకునే వారు రెండు రోజుల పాటు టెంకాయలు విక్రయించుకునేందుకు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. డిపాజిట్ నగదు రూపంలో చెల్లించాలని, హెచ్చు పాటదారుడు వేలంపాట ముగిసిన వెంటనే డిపాజిట్‌తో కలిపి మొత్తం నగదు చెల్లించి రసీదు పొందాలన్నారు. అలా చెల్లించని యెడల పాటదారుని డిపాజిట్‌ను అపరాధ రుసుము కింద దేవస్థానం ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఈ వేలంపాట నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. మరిన్ని వివరాల కోసం దేవదాయశాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఇస్రో శాస్త్రవేత్తల కృషి అభినందనీయం

అట్లూరు : అంతరిక్షంలో రెండు ఉపగ్రహాలను అనుసంధానం చేసే ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన ఇస్రో శాస్త్రవేత్తల కృషి అభినందనీయమని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి శాస్త్రవేత్తలు, సాంకేతిక బృందాన్ని అభినందించారు. గురువారం పోరుమామిళ్ళలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గతేడాది డిసెంబర్ 30న శ్రీహరికోటలోని షార్ అంతరిక్ష కేంద్రం నుండి పంపిన జంట ఉపగ్రహాలను విజయవంతంగా అనుసంధాన ప్రక్రియ పూర్తి చేసి చారిత్రక విజయం సాధించారని, దీంతో భారత్ అంతరిక్ష పరిశోధనల్లో సరికొత్త చరిత్ర సృష్టించిందన్నారు. స్పేస్‌డాకింగ్ టెక్నాలజీలో అమెరికా, రష్యా, చైనా దేశాల తర్వాత నైపుణ్యం సాధించిన 4వ దేశంగా భారత్ నిలవడం గర్వకారణమన్నారు.

అఖిల భారత రజక సంఘం జిల్లా అధ్యక్షుడిగా చైతన్యకుమార్

వేంపల్లె : స్థానిక రజకవీధికి చెందిన చైతన్యకుమార్ సేవలను గుర్తించి ఏబీఆర్‌ఎస్ జాతీయ కార్యాలయం నుంచి అఖిల భారత రజక సంఘం జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ గురువారం అఖిల భారత రజక సంఘం జాతీయ అధ్యక్షుడు మొగ్గ అనిల్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా చైతన్యకుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఎదుర్కొంటున్న రజకుల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతుగా పోరాటం చేస్తానన్నారు.

ఆటో కార్మికుల జిల్లా 4వ మహాసభలు జయప్రదం చేయాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న ఆటో కార్మికులు

పోరుమామిళ్ల : ఈనెల 21, 22 తేదీల్లో కడపలో నిర్వహిస్తున్న ఆటో కార్మికుల (ఏఐటీయూసీ) జిల్లా 4వ మహాసభలను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా నాయకులు రవికుమార్ పిలుపిచ్చారు. గురువారం స్థానిక ఆటో స్టాండు వద్ద మహాసభల కరపత్రాలను వారు విడుదల చేసి మాట్లాడారు. రవాణా రంగంలో ఉన్న లక్షలాది ఆటో కార్మికులకు భద్రత కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. నూతన రోడ్డు రవాణా చట్టం తెచ్చి కార్మికులను జైలుకు పంపే పరిస్థితి తెచ్చారన్నారు. ఆటో కార్మికుల కుటుంబాలకు భరోసా కల్పించడానికి ఆటో రంగ కార్మికులకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేయాలన్నారు. ఆటో కార్మికులకు బ్యాంకుల ద్వారా వడ్డీలేని రుణాలు ఇప్పించి ఆదుకోవాలన్నారు. ఆటో కార్మికుల పట్ల ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై జిల్లా మహాసభల్లో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకుని ముందుకు వెళతామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్యలోని విద్యుత్ లైన్లను తొలగించాలి



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జయంత్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలో పలు వీధులలో ఉన్న 33 కేవీ విద్యుత్ లైన్లను తొలగించాలని లేకుంటే ప్రమాదాలు మరింత జరిగే అవకాశముందని పలువురు అంటున్నారు. 6వ వార్డులో 33 కేవీ విద్యుత్ లైన్ తగిలి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు జయంత్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి గురువారం పరామర్శించారు. ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. పట్టణంలోని 33 కేవీ విద్యుత్ లైన్‌లు 6వ వార్డులోని క్రాంతినగర్ కాలనీలో, 8వ వార్డులోని పుష్పగిరి మాన్యంలో, 13వ వార్డులోని శాంతినగర్ కాలనీలలో ఉన్నాయన్నారు. పుష్పగిరి మాన్యంలో గతంలో ఓ చిన్నారికి గాయాలు కాగ, శాంతినగర్ కాలనీలో విద్యుత్ తీగలు తగిలి ఓ వ్యక్తి మృతి చెందారని ఆయన గుర్తు చేశారు. వీటిని తొలగించాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు.

నేత్రదానంతో అంధులకు చూపు



మృతురాలి కుటుంబ సభ్యుల నుంచి కార్నియాలను సేకరిస్తున్న రాజు

పులివెందుల రూరల్ : నేత్రదానం చేయడంవల్ల అంధులకు చూపు వస్తుందని నేత్ర సేకరణ కేంద్ర అధ్యక్షుడు రాజు తెలిపారు. గురువారం మండలంలోని నల్లపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన కోగటం రామసుబ్బమ్మ మరణించింది. ఈ నేపథ్యంలో మృతురాలి కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరిస్తూ జిలా నేత్ర సేకరణ కేంద్రానికి సమాచారమిచ్చారు. రాజు టెక్నీషియన్ హరీష్‌తో కలిసి మృతురాలి ఇంటి వద్దకు వెళ్లి మృతదేహం నుండి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ బంధువులు, సన్నిహితులు మరణించినా 9966609364, 7093204537లకు సమాచారమిస్తే మనిషి మరణానంతరం మట్టిలో కలిసిపోయే నేత్రాలను దానం చేయడంవల్ల అంధులకు చూపునివ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిష్ వెంకటరెడ్డి, కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కంపచెట్లకు నిలయమైన టిడ్కో ఇళ్లు



కంపచెట్లతో నిండి కనీస వసతులకు నోచుకోని టిడ్కో ఇళ్లు

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలోని ఇళ్లులేని పేదలకు నిర్మించిన టిడ్కో ఇళ్లన్నీ కంపచెట్లతో నిండిపోయాయి. లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్లకు కనీస సదుపాయాలు కల్పించకపోవడంతో రూ.వేలాది కోట్లుతో నిర్మించిన ఇళ్లన్ని నిరుపయోగంగా ఉన్నాయి. 2018 సంవత్సరానికి ముందు అప్పుడు చంద్రబాబు హయంలో టిడ్కో ఇళ్లను నిరుపేదలకు మంజూరు చేశారు. వాటిని లబ్ధిదారులకు బ్యాంక్‌లో రుణాలు ఇప్పించి నెలవారి కంతులు ప్రకారం చెల్లించే విధంగా అప్పట్లో చంద్రబాబు వీటికి గుంతలు తీసి పూనాలు వేశారు. తర్వాత 2019 నుంచి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చెపట్టారు. లబ్ధిదారులకు రుణం భారం లేకుండా ఉచితంగా ఇళ్లను రిజిస్ట్రేషన్ చేయించారు. రూ.కోట్లు మంజూరు చేసి టిడ్కో ఇళ్లను నిర్మించారు. అయితే తర్వాత జరిగిన ఎన్నికల్లో చంద్రబాబు సీఎం అయ్యారు. సుమారు 7 నెలలు దాటినా ఇప్పటి వరకు ఇళ్లలో కనీస సదుపాయాలు కల్పించలేదు. ఇళ్లను పూర్తి చేసి వసతులు కల్పించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

రహదారి భద్రత అందరి బాధ్యత



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆర్టీఓ మురళీధర్, ఆర్టీసీ, ఆర్‌అండ్‌బీ అధికారులు

ప్రొద్దుటూరు క్రైం : రహదారి భద్రత అందరి బాధ్యత అని ఆర్టీఓ మురళీధర్ తెలిపారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను గురువారం ఆర్టీఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్టీఓ కార్యాయంలో రవాణా, పోలీసు, ఆర్టీసి, ఆర్‌అండ్‌బీ అధికారులు కలసి కరపత్రాలు, బ్యానర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్టీఓ మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలన్నారు. అతివేగం ప్రమాదకరమన్నారు. నెల రోజుల పాటు ఆటో, బస్సు డ్రైవర్లతో పాటు విద్యాసంస్థల్లో రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆర్టీఓ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ మల్లికార్జునరెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ లక్ష్మీనరసింహులు, ఎంవీఐలు నారాయణనాయక్, హేమకుమార్, రవీంద్రనాయక్, శ్రీనివాసరెడ్డి, ఏఓ కరిముల్లా, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవు



ఆటోడ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న అర్బన్ సీఐ రాజగోపాల్

బద్వేలు అర్బన్ : ఆటోడ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని అర్బన్ సీఐ ఎం.రాజగోపాల్ తెలిపారు. గురువారం పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో ఆటోడ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్క ఆటోడ్రైవర్ తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండటంతో పాటు సంబంధిత పత్రాలన్నీ సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఆటోడ్రైవర్లు ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలుపుతూ ట్రాఫిక్ సమస్యకు కారణమవుతున్నారని, ఇకపై వారిని ఉపేక్షించమని తెలిపారు. అలాగే ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను చేరవేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపినా అధిక వేగంతో వాహనాలు నడిపినా చర్యలు తప్పవన్నారు. అలాగే కొంత మంది మైనర్లు ఆటోలు నడుపుతున్నారని, వారిపై కూడా చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో అర్బన్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపడం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని

బద్వేలు అర్బన్ : ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపడం కూటమి ప్రభుత్వానికి తగదని డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు ఎం.చిన్ని తెలిపారు. గురువారం డీవైఎఫ్‌ఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన ఆరు నెలలలోపే విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై రూ.16 వేల కోట్ల భారాన్ని మోపారని అన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపే విధానాలకు స్వస్తి పలకాలని, లేనిపక్షంలో డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో డీవైఎఫ్‌ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్ షరీఫ్, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆనాటి గురువులతో 2001-2002వ సంవత్సరపు చెన్నారెడ్డిపల్లె ఆర్సీఎం ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు



ఆనాటి గురువులతో 2000-2001వ సంవత్సరపు కలసపాడు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

కలసపాడు : మండలంలోని చెన్నారెడ్డిపల్లె ఆర్సీఎం ఉన్నత పాఠశాలలో 2001–2002 సంవత్సరంలో, స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 2000–2001 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం గురువారం వేరువేరుగా ఘనంగా జరుపుకున్నారు. ఆనాటి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను నాటి విద్యార్థులు ఘనంగా సన్మానించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఆయా పాఠశాలలో చదివి చాలా సంవత్సరాల తర్వాత అందరూ ఒక్కసారిగా కలవడం చాలా సంతోషంగా ఉందని, మాకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించుకోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో గురువులు జోజిరెడ్డి, జయరామిరెడ్డి, దశరథరామిరెడ్డి, రాయప్ప, శ్రీరాములు, యేసుదాసు, నారాయణ, పూర్వపు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



చిన్నగురువళూరు హైస్కూల్‌లో 2001-02 బ్యాచ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

చాపాడు : 24 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులంతా ఒక చోట కలిశారు. నాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుని వారి దైనందిని జీవితాలను పరిచయం చేసుకున్నారు. మండలంలోని చిన్నగురువళూరు జెడ్పీ హైస్కూల్‌లో 2001–02 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఒక చోట చేరారు. ఇతర జిల్లాలు, రాష్ట్రాలు, దేశాల్లో ఉన్న నాటి విద్యార్థులంతా సామాజిక మాధ్యమాలు వేదికగా ఫోన్లు చేసుకుని సంక్రాంతి రోజున ఒక చోట చేరారు. బంధువులతో కలిసి ఆనందంగా పండగ జరుపుకుని చిన్న నాటి స్నేహితులు, చదువులు చెప్పిన ఉపాధ్యాయులను జెడ్పీ హైస్కూల్‌లో కలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులతో పాటు ప్రస్తుత హెచ్‌ఎం సుగుణమణి, నాటి ఉపాధ్యాయులు సాంబ శివారెడ్డి, సుబ్బరాయుడు, గోపాల్‌రావు, ప్రకాశ్, అంకమ్మ, శ్రీనివాసరావు, నరేంద్ర, వెంకటసుబ్బారెడ్డి, సుశీల, రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : నిరుద్యోగ యువతకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగుళూరులో కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఫౌండేషన్ అడ్మిషన్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 18–28 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి టెన్త్ పాస్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పాస్/ ఫెయిల్ అయినవారు అర్హులన్నారు. వివరాలకు 90004 87423 నెంబరులో సంప్రదించాలన్నారు.

పందుల తరలింపు



పందులను తరలిస్తున్న పెంపకం దారులు

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలోని పందుల తరలింపు, పారిశుద్ధ్యంపై మున్సిపల్ కమిషనర్ శేషఫ జి చర్యలు చేపట్టారు. ఈనెల 14వ తేదీన సాక్షిలో ప్రచురితమైన పడకేసిన పారిశుద్ధ్యం.. అధికారుల చోద్యంపై అనే కథనంకు స్పందన లభించింది. ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలో ఉన్న పందులను పట్టుకుని బయటకు తరలిస్తున్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని పందుల పెంపకం దారులు బృందాలుగా ఏర్పాడి అన్ని వీధులలో ఉన్న పందులు పట్టుకుని బయటకు తరలించారని ఆయన తెలిపారు.

విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలి



శనగ పంటను పరిశీలిస్తున్న ఏడీఏ, ఏఓ

కమలాపురం : ప్రతి రైతు పంటల సాగుకు 24 గంటల ముందే విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలని ఏడీఏ నరసింహారెడ్డి, ఏఓ సరస్వతి తెలిపారు. గురువారం మండలంలోని ఎల్లారెడ్డిపల్లె, వంకమాడ గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వారు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. రైతులకు సలహాలు సూచనలు అందజేశారు. పంటల సాగుకు 24 గంటల ముందే ప్రతి రైతు విత్తన శుద్ధి తప్పని సరిగా చేసుకోవాలన్నారు. అలగే రైతులు ఇ–పంటను నమోదు చేసుకోవడంతో పాటు ఇ–కేవైసీ చేసుకోవాలన్నారు. జనవరి, ఫిబ్రవరి మాసాల్లో నూగు, పెసర, వేరు శనగ పంటలను విత్తు కోవచ్చన్నారు. నూగులో వైఎల్‌ఎం–66,11,17 వంటి రకాలు మంచి ఫలితాలను ఇస్తాయన్నారు. అలాగే వేరుశగనలో టీసీజీఎస్–1694 విత్తనం విత్తు కోవాలనుకునే రైతులు తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం నుంచి విత్తనాలను పొందవచ్చన్నారు. పెసరలో ఎల్‌జీజీ 460, 407, టీఎం96–2, ఐపీఎం2–14, డబ్ల్యుజీజీ–42 వంటి రకాలను విత్తుకోవచ్చన్నారు. అలాగే ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు దృష్టి సారించాలన్నారు. తద్వారా తక్కువ పెట్టుబడులతో అధిక ఆదాయం గడించవచ్చన్నారు. వీఏఏ బాబు, రైతులు పాల్గొన్నారు.

18,19 తేదీల్లో రజతోత్సవాలు

కడప కల్చరల్ : కడప రెడ్డిసేవా సమితి రజతోత్సవాలను ఈనెల 18, 19 తేదీల్లో నగర పరిధిలోని డీఎస్ఆర్ కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు సంస్థ కార్యదర్శి లెక్కల కొండారెడ్డి, సభ్యులు పద్మప్రియ చంద్రారెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా 18న మేలుకొలుపు పేరిట ప్రచురించనున్న రజతోత్సవ ప్రత్యేక సంచికను ముఖ్య అతిథులు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. 19న ఉదయం 10 గంటలకు రాజీవ్‌మార్గ్‌లోని రెడ్డి సేవా సమితి కార్యాలయం వద్ద నుంచి వేమన విగ్రహం వరకు ర్యాలీ నిర్వహిస్తామని, అనంతరం వేమన విగ్రహానికి పూలమాల అలంకరిస్తామని తెలిపారు.